ప్రజాశక్తి
బుధవారం 17 సెప్టెంబర్ 2025
5
కర్నూలు

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పుల్లగుమ్మి గ్రామ రైతులు, నాయకులు

వాహనమిత్రకు ని'బంధనాలు'

కుటుంబానికి ఒక దరఖాస్తుకే అర్హత

ఇతర వృత్తిపరమైన పథకాల్లో లబ్ధి పొందితే అనర్హత

ఆటో, మోటర్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్ మరియు యజమానులకు కూటమి ప్రభుత్వం వాహన మిత్ర పేరుతో ప్రకటించిన రూ.15వేల ఆర్థిక సాయానికి నిబంధనలతో కొర్రీలు పెట్టనుంది. ఇతర వృత్తిపరమైన ప్రభుత్వ పథకాల్లో లబ్ధిపొందితే ఈ సాయానికి అనర్హులుగా పేర్కొంది. కుటుంబంలో ఒకరు మాత్రమే ఈ పథకానికి అర్హులని తెలిపింది. ఈ నిబంధనలపై వ్యతిరేకత వ్యక్తం అవుతోంది...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆటో, మోటర్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్ మరియు యజమానులకు ఏడాదికి రూ.15వేలు ఆర్థిక సాయం ఇచ్చేందుకు వాహన మిత్ర పథకాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. అందులో ఆ పథకం కింద సాయం పొందేందుకు అనేక నిబంధనలు పెట్టింది. ఆటో, మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ వాహన యజమా, డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వ్యక్తి ఒకే కుటుంబానికి చెందిన వారే ఉండాలని పేర్కొంది. దరఖాస్తుదారు లేదా వారి కుటుంబ సభ్యునికి లైట్ మోటార్ వెహికల్ యొక్క డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపింది. వాహనం మన రాష్ట్రంలో మాత్రమే రిజిస్ట్రేషన్ అయ్యి ఉండాలని నిబంధన పెట్టింది. మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ విషయంలో వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, మోటార్ వాహన టాక్స్ కలిగి ఉండాలని తెలిపింది. ఆటో రిక్షా విషయంలో నెల రోజుల లోపు ఫిట్‌నెస్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ప్యాసింజర్ ఆటోలకు మాత్రమే ఈ పథకానికి అర్హులు కానున్నారు. గూడ్స్ ఆటో యజమానులు అర్హులు కాదని ప్రభుత్వం తన మార్గదర్శకాల్లో పేర్కొంది. వాహనం దరఖాస్తుదారుని ఆధీనంలో మాత్రమే ఉండాలని, ప్రతి దరఖాస్తుదారుడు ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండాలని తెలిపింది. ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు చేసుకునే అవకాశం మాత్రమే ఉంటుందని నిబంధన పెట్టింది. దీంతో ఒకే కుటుంబంలో ఇద్దరు ఆటో డ్రైవర్లు, యజమానులు ఉన్నా వారిలో ఒకరికే సాయం అందనుంది. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఇతర వృత్తిపరమైన లబ్ది పొందిన వారు ఈ పథకానికి అనర్హులని తెలిపింది. కుటుంబంలో ఎవరు ప్రభుత్వ ఉద్యోగి అయినా, ఆదాయ పన్ను పరిధిలో ఉన్నా ఈ పథకం కింద సాయాన్ని పొందేందుకు అవకాశం లేదు. నెలకి 300 యూనిట్ల లోపు కరెంటు వినియోగించే వారు ఈ పథకానికి అనర్హులని ప్రభుత్వం పేర్కొంది. గ్రామీణ ప్రాంతాలలో మూడు ఎకరాలు ఆరుతడి, పది ఎకరాలు పొడి భూమి ఉన్నా మున్సిపల్ ఏరియాలలో 1000 స్క్వేర్ మీటర్ల స్థలం ఉండే అభ్యర్థులు ఈ పథకానికి అనర్హులని తెలిపింది. గతంలో వైసిపి ప్రభుత్వం అందించిన వైఎస్ఆర్ వాహన మిత్ర కింద నాలుగో విడతలో కర్నూలు 11,497 మంది ఆటో, టాక్సీ, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లు, నంద్యాల జిల్లాలో 8,225 మంది లబ్ధిదారులు లబ్ధిపొందారు. వారిలో అర్హులను గుర్తించి సచివాయాల్లో ఆన్‌లైన్ చేయనున్నారు. బుధవారం నుంచి ఈ నెల 19 వరకూ గ్రామ, వార్డు సచివాయాల్లో దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించారు. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం పెట్టిన నిబంధనల వల్ల వాహన మిత్ర లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. పలు ఆటో కార్మికుల సంఘాలు ఆ నిబంధనలను వ్యతిరేకిస్తున్నాయి.

రూ.25 వేలు ఇవ్వాలి

ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు లేక ఆటోలు నడుపుకుంటున్నారు. ప్రభుత్వం వారికి రుణాలు ఇవ్వకపోవడం వల్ల ప్రయివేట్ ఫైనాన్స్‌లో రుణాలు తీసుకుని వడ్డీలు కట్టుకుంటున్నారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15వేలు ఏ మాత్రం సరిపోదు. ప్రతి డైవర్‌కూ ఏడాదికి రూ.25వేలు ఇవ్వాలి. వాహన మిత్ర నిబంధనలను సవరించి అర్హులందరికీ ఆర్థిక సాయం అందజేయాలి.

- మహమూద్, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి.

అర్హులందరికీ ఇవ్వాలి

వాహన మిత్ర పథకం కింద రూ.15వేలు అందించేందుకు ప్రభుత్వం అనేక నిబంధనలు పెట్టింది. చాలా మంది ఆటో డ్రైవర్లు అప్పులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ నిబంధనలు సవరించి అర్హులందరికీ వాహన మిత్ర కింద లబ్ధిని అందించాలి.

- పాపన్న, ఆటో డ్రైవర్, కర్నూలు.

రైతులను భయపెట్టడం తగదు

- సీతారామయ్య ఐరన్ ఓర్ లీజ్‌ను రద్దు చేయాలి
- తహశీల్దార్ కార్యాలయం ముందు రైతు సంఘం ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి రైతులు సాగు చేసుకుంటున్న భూముల దగ్గరికి పోలీసులు వెళ్లి భయభ్రాంతులకు గురి చేయడం తగదని, సీతారామయ్య ఐరన్ ఓర్ లీజ్‌ను రద్దు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. పుల్లగుమ్మి రైతుల భూములలో ఐరన్ ఓర్ యజమాని సీతారామయ్య లారీలు, టిప్పర్లు పోయే ప్రయత్నం విరమించుకోవాలని కోరుతూ మంగళవారం కల్లూరు తహశీల్దార్ కార్యాలయం ముందు రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఏ.కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జి.రామకృష్ణ మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా కల్లూరు మండలం యాపర్లపాడు గ్రామ రెవెన్యూ పరిధిలో సాగు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వం 2004లో పట్టాలు ఇచ్చిందని తెలిపారు. అందరి భూములలో బోర్లలో నీళ్లు పడి రెండు, మూడు కార్ల పంటలు పండుతున్నట్లు తెలిపారు. ఆ భూములు ఇప్పుడు కోనసీమను తలపించే విధంగా ఉన్నాయని చెప్పారు. ఇప్పుడిప్పుడే పేద రైతుల జీవన పరిస్థితులలో మార్పు వస్తున్న సమయంలో సీతారామయ్య ఐరన్ ఓర్ లీజ్ తీసుకొని వచ్చి 80 మంది సాగు చేసుకుంటున్న రైతుల భూములలోకి ప్రవేశించి భయాందోళనకు గురి చేయడం తగదన్నారు. ఇప్పటికైనా రైతుల భూములలో సీతారామయ్య లారీలు, టిప్పర్లు పోవడానికి వీలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదా ఐరన్ ఓర్ లీజును రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వీఆర్వో లాంటి అధికారి రైతులను బెదిరించడం, పోలీసులను తీసుకుపోయి భయభ్రాంతులకు గురి చేయడం సమంజసం కాదని, ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తహశీల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. తప్పనిసరిగా చర్యలు తీసుకుంటా నని, రైతులకు అండగా ఉంటానని తహశీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బాధిత రైతులు లక్ష్మన్న, రాజు, నాగరాజు, సుశీలమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

18, 19న కర్నూలు మార్కెట్ యార్డ్‌కు సెలవు

ప్రజాశక్తి - కర్నూల్ కలెక్టరేట్

ఈ నెల 18, 19వ తేదీలలో కర్నూల్ మార్కెట్ యార్డ్‌కు సెలవు ప్రకటించినట్లు జెసి బి.నవ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే మార్కెట్ యార్డ్ పూర్తిగా నిండి పోయిందన్నారు. ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్‌లో కూడా ఉల్లి క్రయ విక్రయాలు జరుగుతాయన్నారు. ఉల్లి పంట ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ఈ నెల 18, 19న కర్నూలు మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు తెలిపారు. రిటైలర్స్, హోల్‌సేలర్స్, హోటల్స్ యాజమాన్యాలు బహిరంగ వేలంలో పాల్గొని ఉల్లి కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధికి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సదస్సులో పాల్గొన్న కలెక్టర్, ఎస్పి

అన్ని రంగాల్లో జిల్లాను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి సిఎం చంద్రబాబు నాయుడుకు వివరించారు. గత రెండు రోజులుగా అమరావతిలో జరుగుతున్న జిల్లా కలెక్టర్ల సదస్సు మంగళవారం కొనసాగింది. ఈ సదస్సులో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ పాల్గొన్నారు. జిల్లాలో రానున్న కాలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కలెక్టర్‌కు సిఎం దిశా నిర్దేశం చేశారు. ఈ సమీక్షలో మంత్రి టీజీ భరత్ కూడా పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

గొర్రెలకు మేతగా ఉల్లి పంట

- ధర లేదని 4.5 ఎకరాల పంట వదిలేసిన కష్టట్రాళ్ల రైతు
- రూ.3.40 లక్షలు నష్టం

(వార్తలు మెయిన్‌లో....)

వెంకటస్వామి స్ఫూర్తితో పేదల అభివృద్ధికి కృషి

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కామ్రేడ్ వెంకటస్వామి స్ఫూర్తితో అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం ఉద్యమిద్దామని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు పేర్కొన్నారు. మంగళవారం కర్నూలు నగరం శరీన్ నగర్‌లో వెంకటస్వామి గృహం వద్ద వెంకటస్వామి రెండవ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కెవిపిఎస్ న్యూ సిటీ అధ్యక్షులు యేసు రాజు అధ్యక్షత వహించారు. ముందుగా వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు, న్యూ సిటీ కార్యదర్శి ఎం భాస్కర్, న్యూ సిటీ ఉపాధ్యక్షులు ఆర్ పెద్ద బాబు, వెంకటస్వామి తనయుడు శ్రీనివాసులు మాట్లాడారు. అనంతరం తండ్రి ఆశయాలకు అనుగుణంగా డీఎస్సీలో విజయం సాధించిన తనయుడు శ్రీనివాసులును సంఘం నాయకులు శాలువా పూలమాలతో సత్కరించి, అభినందించారు. వర్ధంతి సభలో కెవిపిఎస్ న్యూ సిటీ సహాయ కార్యదర్శి చిన్న ఆనంద్, నాయకులు రామాంజనేయులు, పెద్ద మధు, మరియమ్మ, సరోజమ్మ, వెంకటస్వామి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

'స్త్రీ శక్తి'కి బహుళ ప్రజాదరణ

- ఎంపీ బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా స్త్రీ శక్తి పథకం బహుళ ప్రజాదరణ పొందిందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. మంగళవారం కర్నూలు ఆర్‌టిసి బస్టాండ్ స్టేషన్ మేనేజర్ ఛాంబర్‌లో ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్ పూల నాగరాజుతో కలిపి ఎంపీ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. జిల్లా పరిధిలోని ఐదు బస్టాండ్లలో ప్రయాణికుల సౌకర్యార్థం మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్ మాట్లాడుతూ... స్త్రీ శక్తి పథకం ద్వారా జిల్లా పరిధిలో రోజూ దాదాపు 40 వేల మంది మహిళలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఒక్క కర్నూలు జిల్లాకు సంబంధించి రోజూ దాదాపు రూ.17 లక్షల భారాన్ని ప్రభుత్వం భరిస్తోందని చెప్పారు. జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ... రద్దీ పెరిగిన దృష్ట్యా ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యమూ కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం పూల నాగరాజు బస్టాండులోని ప్రయాణికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్టాండులోని వసతుల నిర్వహణ పట్ల జోనల్ ఛైర్మన్ సంతృప్తి వ్యక్తం చేశారు. డిసిసి ఛైర్మన్ నాగేశ్వరావు యాదవ్, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సుధారాణి, కర్నూలు-2 డిపో మేనేజర్ కెఎల్‌కె.శర్మ, స్టేషన్ మేనేజర్ కెకె.లత, కార్గో ఇన్‌ఛార్జ్ దీప్తి స్రుజన పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

11మంది స్వీపర్లను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు వినతి

కరోనా సమయంలో తొలగించిన 11 మంది స్వీపర్లను విధుల్లోకి తీసుకోవాలని ఆర్‌టిసి రాయలసీమ రీజనల్ ఛైర్మన్ పూల నాగరాజు, ఎంపీ బస్తిపాటి నాగరాజులకు సిఐటియు నగర అధ్యక్షులు నగేష్, కోశాధికారి సాయిబాబా విన్నవించారు. గతంలో ఆర్‌టిసిలో 43 మంది స్వీపర్లు పని చేస్తుండగా, కరోనా సమయంలో చాలామందిని తొలగించారని తెలిపారు. కొంతమందిని విధుల్లోకి తీసుకున్నారని, మిగిలిన 11 మంది విధుల్లోకి తీసుకోవాలని కోరారు. 11 మందిని విధుల్లోకి తీసుకునేలా ఈడీకి ప్రపోజల్ పెట్టాలని ఆర్‌ఎంని ఛైర్మన్ ఆదేశించారు. సిఐటియు నాయకులు దేవరాజు, నరసింహులు పాల్గొన్నారు.

హకిబ్ కుటుంబాన్ని ఆదుకుంటాం : కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నగరంలోని కీర్తి హైస్కూల్‌లో గోడ కూలి మృతి చెందిన విద్యార్థి హకిబ్ కుటుంబాన్ని ఆదుకుంటామని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి తెలిపారు. మంగళవారం ఆమె బాధిత కుటుంబానికి ఫోన్ చేసి పరామర్శించారు. జరిగిన సంఘటన చాలా బాధాకరమని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంఘటన జరిగిన స్కూల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బాధితులకు ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఇంటి స్థలం కూడా మంజూరు చేయాలని ఆర్‌డిఒను ఆదేశించారు. ఇప్పటికే కేసుకు సంబంధించి ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశారన్నారు. అలాగే తమ రెండో కుమారుని ఆ స్కూల్‌లో చదివించలేమని, వేరే స్కూల్‌కు మార్చాలని, తమది నిరుపేద కుటుంబమని, తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఈనెల 19న అమరావతిలో మెగా డీఎస్సీ కార్యక్రమం అయిపోయిన వెంటనే బాధిత కుటుంబాని కలిసి న్యాయం జరిగేలా చేస్తామన్నారు.

వాల్మీకి విగ్రహం తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి -కోడుమూరు

కర్నూలులో వాల్మీకి మహర్షి విగ్రహం తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని టిడిపి పట్టణ అధ్యక్షులు గంగాధర్ నాయుడు, మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి కోరారు. మంగళవారం వారు మాట్లాడారు. మేయర్ బివై.రామయ్య వాల్మీకుల ద్రోహి అని, రాబోయే రోజుల్లో ఆయనకు వాల్మీకులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న కెడిసిసిబి ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి వాల్మీకి విగ్రహాన్నిఅక్కడే ప్రతిష్టింపజేశారని తెలిపారు. పట్టె మధు, గోరంట్ల మధుసూదన్ నాయుడు, రవీంద్ర గౌడ్, వెంకటేశ్వర్లు, అయ్యప్ప, సురేష్, పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

టమోటా మార్కెట్‌ను సందర్శించిన శ్రీదేవి

ప్రజాశక్తి - పత్తికొండ

రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

గత రెండు రోజులుగా గిట్టుబాటు ధర లేక రైతులు పడుతున్న అవస్థలను అడిగి తెలుసుకునేందుకు పత్తికొండ టమోటా మార్కెట్‌ను మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మంగళవారం సందర్శించారు. జత గంపలు రూ.70 నుంచి రూ.200 దాకా కొనుగోలు చేస్తున్నారని, 25 కిలోల జత టమోటా బాక్సులను రూ.250 నుంచి 500 దాకా కొనుగోలు చేస్తున్నారని రైతులు చెప్పారు. గత వారంలో కనీసం కిలో టమోటా రూ.2 కూడా కొనుగోలు చేయకపోవడంతో మార్కెట్లోనే వదిలేసిన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వం టమోటాకు గిట్టుబాటు ధర కల్పించేలా రైతులకు అండగా పోరాడతామని తెలిపారు. కనీస ధర కూడా లభించకపోతే ప్రభుత్వం రూ.8లకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ అమలు కావడం లేదని విమర్శించారు. ప్రభుత్వం టమోటా రైతులను ఆదుకునేందుకు ముందుకు రావాలని కోరారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోవడంతో ఉల్లి పంటను దున్నేస్తున్న పులికొండ, కొత్తిమీర నెట్టేకల్ రైతుల పొలాలను ఆమె పరిశీలించారు. ఎంపిపి నారాయణ, మేధావుల ఫోరం రాష్ట్ర నాయకులు శ్రీరంగుడు, వైసిపి నాయకులు బనగాన శ్రీనివాసులు, పెద్దహుల్తి నాగరాజు పాల్గొన్నారు.

స్కానింగ్ కోసం నిరీక్షణ

- జిజిహెచ్‌లో సిబ్బంది అలసత్వం
- రోగులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు జిజిహెచ్ స్కానింగ్ సెంటర్ల దగ్గర కష్టాలు తప్పడం లేదు. సత్వర చికిత్స కోసం వైద్య పరీక్షలు త్వరగా నిర్వహించి మెరుగైన వైద్యాన్ని వెంటనే అందిస్తున్నామన్న అధికారుల మాటలు నీటిని ముట్టలుగానే మిగిలిపోతున్నాయి...

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రోజుకు 2500 నుంచి 3000 దాకా రోగులు కర్నూలు తోపాటు సుదూర ప్రాంతాల నుంచి వస్తుంటారు. వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చే రోగులు స్కానింగ్ సెంటర్ల వద్ద ఆరోజు టోకెన్ కోసం పడికాపులు కాయడం లేదంటే మరుసటి రోజు కోసం సుదూర ప్రాంతం వెళ్లి తిరిగి రావాల్సిన పరిస్థితి రోగులకు ఏర్పడుతుంది. దీనికి తోడు సకాలంలో విధులు నిర్వర్తించాల్సిన రేడియాలజీ విభాగపు స్కానింగ్ సెంటర్ల టెక్నీషియన్స్, స్కానింగ్ రిజిస్ట్రేషన్ కౌంటర్ నర్సింగ్ సిబ్బంది సరైన సమయనికి రాకపోవడంతో రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కావాల్సిన స్కానింగ్ సెంటర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ, స్కానింగ్ పరీక్షలు 9 గంటలౌతున్నా మొదలు కావడం లేదు. అప్పటికే సుదూర ప్రాంతాల నుంచి ఉదయాన్నే వచ్చిన సుమారు 50 మంది రోగులు క్యూలో నిలుచుని టోకెన్ కోసం ఎదురుచూస్తున్నారు. ఇలా టోకెన్ కోసం స్కానింగ్ పరీక్షల కోసం గంటల తరబడి క్యూలో నిలుచుని ఇబ్బంది పడే పరిస్థితులు నెలకొన్నాయి. రేడియాలజీ విభాగపు ఉదయం పూట 160 టోకెన్ ఇవ్వగా మధ్యాహ్నం తర్వాత మరికొద్ది మందికి టోకెన్లు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. సిబ్బంది సమయనికి వచ్చి స్కానింగ్ పరీక్షలు చేయడం ద్వారా స్కానింగ్ సెంటర్ల సంఖ్యను పెంచడం, ఉన్న స్కానింగ్ సెంటర్లలో తగినంత మంది సిబ్బందిని సమకూర్చుకోవడం రద్దీని తగ్గించి ప్రజలకు అనవసర ఖర్చులను తగ్గించాలని ఆసుపత్రి, జిల్లా అధికారులను ప్రజలు వేడుకుంటున్నారు. సమస్యపై ఆస్పత్రి సూపరింటెండెంట్ ను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

రాత్రి ఇక్కడే పడుకుని పడిగాపులు

- ఎన్.రామాంజనేయులు

సోమవారం రోజు ఓపి చూయించు కుంటే స్కానింగ్ రాశారు. మధ్యాహ్నం మూడు గంటలకే కొద్ది మందికి టోకెన్ ఇచ్చి బంద్ చేశారు. మాకు ఇవ్వలేదు. మరుసటి రోజు రమ్మన్నారు. దాంతో ఇక్కడే రాత్రంతా పడుకుని స్కానింగ్ కోసం ఇక్కడే పడిగాపులు కాస్తున్నాను.

రెండు రోజులుగా తిరుగుతున్నాను

- సాంబ, పగిడ్యాల.

సోమవారం చూపించుకున్నాను. స్కానింగ్‌కు రాశారు. స్కానింగ్ కోసం రెండు రోజులుగా తిరుగుతున్నాను. ఉదయం 9 గంటలు అవుతున్న ఇప్పటి దాకా సిబ్బంది రాలేదు. వృద్ధులు, మహిళలు ఎక్కువసేపు క్యూలో నిలబడి ఉండవలసి వస్తుంది. సిబ్బంది కరెక్ట్ టైమ్‌కు రావాలి. స్కానింగ్ సెంటర్లను పెంచి సిబ్బందిని పెంచాలి.

మళ్లీ రమ్మన్నారు

- వెంకట సుబ్బయ్య, అనుపూరు, నంద్యాల జిల్లా.



సోమవారం ఓపిలో చూపించుకున్నాను. స్కానింగ్‌కు రాస్తే నిన్న రద్దీగా ఉండడంతో ఈరోజు రమ్మన్నారు. నేను ఆళ్లగడ్డ నుంచి ఉదయన్నే వచ్చి క్యూలో ఉన్నాను. ఇప్పటి వరకు ఎవరూ రాలేదు.

ఆర్‌టిసి కార్మికుల హక్కుల పరిరక్షణే లక్ష్యం

- ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారి దివాకర్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఆర్‌టిసి కార్మికుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ప్రయివేటీకరణ చర్యలను ప్రతిఘటిస్తామని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్ తెలిపారు. పిటిడి (ఆర్‌టిసి) ఎస్‌డబ్ల్యుఎఫ్ 47వ వ్యవస్థాపక దినోత్సవ సభ కర్నూలులోని కార్మిక కర్షక భవన్‌లో నిర్వహించారు. రీజనల్ నాయకులు విఎస్.రాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యుత్ బస్సుల పేరుతో ఆర్‌టిసిలో ప్రయివేటీకరణ చర్యల వేగవంతం, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నిర్ణయాలు చేయడం స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ వ్యతిరేకిస్తుందని తెలిపారు. విద్యుత్ బస్సుల నిర్వహణ మొత్తాన్ని ఆర్‌టిసికే అప్పజెప్పాలని, కొత్త బస్సులను కొనుగోలు చేసి, సిబ్బందిని రిక్రూట్ చేసుకొని స్త్రీ శక్తి బస్సుల్లో వస్తున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు మాట్లాడుతూ... ఆర్‌టిసి కార్మికుల పోరాటాలకు సిఐటియు అండగా ఉంటుందని తెలిపారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ రీజనల్ నాయకులు ఎస్ఆర్‌కె.రెడ్డి, కర్నూలు-1 డిపో కార్యదర్శి బి.నాగరాజు, కర్నూలు-2 డిపో కార్యదర్శి బజారి, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు ఎస్‌ఎ.సలాం, ఆర్‌ఎల్.నాయుడు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నేటి నుంచి మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు

- డిఎంహెచ్‌ఒ డాక్టర్ శాంతికళ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

స్వస్త్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్ పేరుతో మహిళల ఆరోగ్యం కోసం నేటి నుండి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు డిఎంహెచ్‌ఒ డాక్టర్ పి.శాంతి కళ, స్టేట్ నోడల్ ఆఫీసర్లు డిప్యూటీ డైరెక్టర్ రామనాథం, అయుష్మాన్ భారత్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నరేష్ తెలిపారు. ప్రోగ్రాం అధికారులతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆధ్వర్యంలో మంగళవారం వారు సమీక్షా సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 2 వరకు రెండు వారాల పాటు ఈ కార్యక్రమం సాగుతుందన్నారు. మహిళల ఆరోగ్యాన్ని కాపాడి కుటుంబం బలపరిచే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేశామని వివరించారు. ఈ వైద్య శిబిరాలు సంబంధిత ఆరోగ్య కేంద్ర ఆసుపత్రి వైద్యాధికారులు నేతృత్వంలో నిర్వహించబడతాయన్నారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, డిఎల్‌ఎటిఓ డాక్టర్ భాస్కర్, డిఐఓ డాక్టర్ నాగప్రసాద్ బాబు, జిల్లా వైద్య శాఖ అనుబంధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ డాక్టర్ శాంతి కళ

కాటికాపరుల సంఘం ఎన్నిక

- మండల అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, గిరి

ప్రజాశక్తి - గూడూరు

కాటికాపరులు సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. మంగళవారం గూడూరులోని సంజీవయ్య నగర్‌లో మండల కాటికాపరుల సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా నాయకులు రంగన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కాటికాపరుల సంఘం రాష్ట్ర నాయకులు ఎమ్‌డి.ఆనంద్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు రాజా రమేష్ మాట్లాడారు. వృత్తి గుర్తింపు కోసం, వృత్తిదారులందరినీ నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. వృత్తి పరికరాలను ప్రభుత్వమే ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కాటికాపరుల మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా గిరి, ఉపాధ్యక్షులుగా తిమ్మరాజు, గిడ్డయ్య, సహాయ కార్యదర్శులుగా బతుకన్న, రాంబాబు, కమిటీ సభ్యులుగా పెద్దరాజు, వేణుగోపాల్, శేఖర్, చిన్న గిడ్డయ్య, శివరామకృష్ణ, కర్రెన్న, తిమ్మప్ప, శ్రీనివాసులు, తిరుమలేష్ ఎన్నికయ్యారు.

ఐవిఎల్‌పిలో పాల్గొనడం సంతోషంగా ఉంది

- బిజెపి అధికార ప్రతినిధి డాక్టర్ వినూషా రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు జిల్లా పరిషత్



భారతదేశం పట్ల ప్రపంచ దేశాలకు మంచి అభిప్రాయం ఉందని బిజెపి అధికార ప్రతినిధి డాక్టర్ బి.వినూషా రెడ్డి తెలిపారు. మంగళవారం కర్నూలులోని నివాసంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారతదేశం తరుపున ఇంటర్నేషనల్ విజిటర్స్ లీడర్ షిప్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం(ఐవిఎల్‌పి)లో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. దాదాపు నెలరోజుల పాటు జరిగిన ఈపర్యటన వివరాలు బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి నడ్డాకు వివరించామన్నారు. రాజకీయాలు, సామాజిక రంగంలో మహిళల పాత్ర అనే అంశంపై తాను పాల్గొన్నానని ఈ పర్యటనలో 22 దేశాల నుంచి మహిళ ప్రతినిధులు హాజరయ్యారని వివరించారు. మహిళలకు సంబంధించిన అంశాలపై అన్ని దేశాలతో పోల్చితే మనదేశంలో మహిళలకు మంచి గౌరవం, భద్రత ఉందన్నారు. 2029 ఎన్నికల్లో భారతదేశంలోని చట్టసభల్లో 40 శాతానికి పైగా మహిళలు ప్రాతినిధ్యం వహిస్తారన్న నమ్మకం ఉందని తెలిపారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - సి బెళగల్

కంభదహాల్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తూ ఆస్పరి మండలానికి నాగన్న హైస్కూల్ హెచ్‌ఎంగా బదిలీపై వెళ్లారు. ఇదే పాఠశాలలో ఉపాధ్యాయులుగా మనోజ్ కుమార్, లక్ష్మిపతిలు పని చేస్తూ ఆయా మండలాలకు బదిలీ అయ్యారు. మంగళవారం ఇక్కడి హెచ్‌ఎం సునీతా కుమారి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సమక్షంలో సన్మానం చేశారు. ఎంపీటీసీ యాకోబు, గ్రామ పెద్దలు సత్యారెడ్డి, హనుమంతు యాదవ్, యుటీఎఫ్ నాయకులు తిమ్మన్న, కిషోర్, శేఖర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

మహాసభనుద్దేశించి మాట్లాడుతున్న అంజిబాబు

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - ఆస్పరి

అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.అంజిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో సిఐటియు 6వ మండల మహాసభ నిర్వహించారు. సిఐటియు మండల కన్వీనర్ విశ్వనాథ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంగన్వాడీలకు పనికి తగ్గ వేతనం రూ.25 వేలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఫేస్ యాప్‌ను రద్దు చేసి గతంలో మాదిరిగానే కొనసాగించాలని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు మూడు నెలలుగా వేతనాలందక ఇబ్బంది పడుతున్నారని, పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా రామాంజనేయులు, కోకన్వీనర్‌గా విశ్వనాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీనియర్ నాయకులు హనుమంతు, బాలకృష్ణ, అంగన్వాడీలు రసూల్ బీ, రాధమ్మ, ఆశాలు లక్ష్మి, ఈరన్న, భువనేశ్వరి, ఆటో కార్మికులు మల్లి, నవీన్, లింగన్న పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- విద్యుత్ ఉద్యోగుల నిరసన

నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

విద్యుత్ శాఖలో పనిచేసే రెగ్యులర్, ఒప్పంద ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నాయకులు కోరారు. మంగళవారం విద్యుత్ ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో గోనెగండ్ల విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. జెఎసి నాయకులు రాయచోటి స్వామి మాట్లాడుతూ... విద్యుత్ శాఖలోని రెగ్యులర్, ఒప్పంద ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో జెఎసి దశలవారీ పోరాటానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. అందులో భాగంగా రెండు రోజుల నిరసన పూర్తయిందన్నారు. ఈనెల 17, 18వ తేదీల్లో రెండు రోజులు సర్కిల్ కార్యాలయాల వద్ద భోజన విరామంలో నిరసనలు నిర్వహిస్తామన్నారు. అనంతరం 19, 20వ తేదీల్లో సర్కిల్ కార్యాలయాల వద్ద రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం, అధికారులు స్పందించకపోతే సర్కిల్ కార్యాలయాల నుంచి బయల్దేరి 22న కలెక్టరేట్ వరకు శాంతి ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అధికారులు స్పందించి ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని, ఒప్పంద ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, డిఎలను సక్రమంగా అందజేయాలని కోరారు. అనిల్, రత్నకుమార్, మాబు హుస్సేన్, మురళీ, రంగస్వామి, రఘు పాల్గొన్నారు.

సాగునీటికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - ఆదోని

డిజైన్‌ను పరిశీలిస్తున్న ఇంజినీర్లు

ఆదోని పరిసర ప్రాంతాల్లో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి ఇరిగేషన్‌ను అభివృద్ధి చేస్తామని మైనర్ ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ కబీర్ బాష తెలిపారు. మంగళవారం మైనర్ ఇరిగేషన్ ఆదోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పాండురంగయ్యతో కలిసి ఆలూరు నియోజకవర్గంలోని ప్రాంతాలను సందర్శించి ఆనకట్ట నిర్మాణాలకు డిజైన్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆలూరు నియోజకవర్గం సరిహద్దులోనే కర్ణాటక రాష్ట్రం ఉండడంతో ఇక్కడ రిజర్వాయర్ నిర్మిస్తే ఎక్కువగా కర్ణాటక రాష్ట్రానికి మేలు జరుగుతుందని తెలిపారు. పెద్ద వంకలను అనుసంధానం చేసి ఆంధ్రా సరిహద్దులోకి కలిసే విధంగా చర్యలు చేపడతామన్నారు. దిగువ కాలువను అభివృద్ధి చేసేందుకు లిఫ్ట్ ద్వారా లేక డ్యామ్ ద్వారా ఎలా తీసుకురావాలనేది పరిశీలిస్తామని తెలిపారు. తెలుగు రైతు అధికారిక ప్రతినిధి పి.సాయిబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పాండురంగ, ఎగ్జిక్యూటివ్ డిప్యూటీ ఇంజినీర్ షఫీవుల్లా, డిఇఇ క్రిస్టిన్, అసిస్టెంట్ ఇంజినీర్ ఈశ్వర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సంజీవ్ కుమార్, చిన్న రాజా పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో చర్యలేవి..?

- చిన్నపాటి వర్షానికే నిలుస్తున్న నీరు
- చెరువులను తలపిస్తున్న కాలనీలు

ప్రజాశక్తి - ఆదోని

చిన్నపాటి వర్షం కురిసినా ఆదోనిలో నీరు రోడ్లపైనే నిలుస్తోంది. కాలువల గుండా నీరు పారకుండా రోడ్లపైనే నిలిచి చెరువును తలపిస్తున్న పరిస్థితి ఉంది. వానొస్తే లోతట్టు ప్రాంత వాసులకు అవస్థలు తప్పడం లేదు. నీటి మళ్లింపునకు ప్రత్యామ్నాయ చర్యలు లేకపోవడంతో మురుగునీటిలోనే నడుస్తూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లక్షలాది రూపాయలతో భవనాలు నిర్మించే వారు నిబంధనలు పాటించకపోవడమో, అన్యాక్రాంతమవడమో జరుగుతోందని పురవాసులు వాపోతున్నారు. పట్టణంలో వరద నీరు వెళ్లే ఉప్పరు, ఎర్రవంకలపై అనేక అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో చిన్న కాలువలుగా మారిపోయాయి. అందులోనే చెత్త, వ్యర్థాలను వేస్తున్నారు. యంత్రాల ద్వారా సహాయక చర్యలకు ఇబ్బందిగా మారిందని శానిటేషన్ ఉద్యోగులు చెబుతున్నారు.

23 ముంపు ప్రాంతాలు : ఇటీవల కురిసిన వర్షాలకు క్రాంతి నగర్ ఎక్స్‌టెన్షన్, రాజా సాహెబ్ నగర్, కౌడల్‌పేట్, హవన్నపేట, మహాత్మగాంధీ నగర్, ఆవుదూడ వంక పరివాహక ప్రాంతం వడ్డే గేరి, బోయగేరి, బుడేకల్లు, గణేష్ సర్కిల్, వాల్మీకి నగర్ ప్రాంతాలతో పాటు శివారు కాలనీలను వరద నీరు తాకింది. ఆ ప్రాంతవాసులకు రాత్రంతా కంటికి కునుకు లేని పరిస్థితి దాపురించింది. రాంజల చెరువులో నీరు నిండింది. అక్కడి నుంచి పొంగిపొర్లే నీరు ఆవుదూడ వంక, ఎర్రవంకలకు పట్టణంలో 12 నుంచి 14 కిలోమీటర్ల దూరం ప్రవహిస్తుందని చెబుతున్నారు. ఆ వంకలు పొంగిపొర్లే ముంపు ప్రాంతాలు పట్టణంలో 23 ఉన్నట్లు గుర్తించామని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తీసేందుకు కొన్నిచోట్ల అవకాశం లేదు. వంకలు కుంచించుకుపోవడంతో అందులో దిగేందుకు కూడా వెడల్పు లేని పరిస్థితి ఉంది. అన్యాక్రాంతాలు పెరిగిపోయి ఉండడంతో ఈ పరిస్థితి దాపురించిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. అక్రమ కట్టడాలు తొలగించి వంకలు వెడల్పు చేయాలని, మురుగు కాలువలపై నిర్మించిన కట్టడాలను తొలగించి చెత్తాచెదారం అడ్డుపడకుండా నీరు పారేలా ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అహర్నిశలు శ్రమిస్తున్నాం : మున్సిపల్ కమిషనర్ కృష్ణ

పట్టణ పైభాగానే ఉన్న రాంజల చెరువు నిండి ఉంది. అందులో నుంచి నీరు వంక గుండా పట్టణంలోకి వస్తుంది. జ్యోతిర్మయి కళాశాల, ఎన్‌జిఒస్ కాలనీ ప్రాంతాల్లో వంకలో ఉన్న ముళ్ల కంపను యంత్రాల ద్వారా తొలగించాం. బార్‌పేట, కొసిగి, ఎన్‌జిఒస్ కాలనీ ప్రాంతాల్లో కాలువలకు అడ్డంగా కొందరు బండలు పాతారు. వాటిని తొలగించడం వల్ల నిలిచిన నీరు కాలువల గుండా పారింది. గురు, శుక్రవారం రెండు రోజులూ సుమారు 120 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. వర్షంలో సైతం లెక్కచేయకుండా ఇంజినీరింగ్, పారిశుధ్య ఉద్యోగులు అహర్నిశలు శ్రమిస్తూ ఇబ్బందులు ఉన్నచోట తక్షణమే సహాయక చర్యలు చేపడుతున్నారు. అక్రమ కట్టడాలు, అన్యాక్రాంతమైన వంకల ప్రాంతాలను గుర్తించాం. అందరి సహకారంతో త్వరలోనే తొలగింపు పనులు చేపడతాం.

నీటిని కాలువలకు వెళ్లేలా ఏర్పాట్లు చేయిస్తున్న కమిషనర్ కృష్ణ

విద్యార్థిని అభినందిస్తున్న సిబ్బంది

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎంపిక కావడంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఉపాధ్యాయులు సుల్తానా, ఉమామహేశ్వరి, ఎల్లమ్మలు విద్యార్థిని బి.అక్షయను అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహరాజు మాట్లాడుతూ... ఈ నెల 15న కోసిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర గ్రౌండ్‌లో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్టును ఎంపిక చేసినట్లు తెలిపారు. తమ పాఠశాల తరఫున 9వ తరగతి విద్యార్థిని బి.అక్షయ రైడింగ్, డిఫెండింగ్‌లో రాణించి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని చెప్పారు. ఈ నెల 22 నుంచి 25 వరకు ఎన్‌టిఆర్ జిల్లా గొల్లపూడిలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు కర్నూలు జిల్లా నుంచి బి.అక్షయ పాల్గొంటారని ఆనందం వ్యక్తం చేశారు. అక్షయ రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని పాఠశాల ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు విరూపాక్షప్ప, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

శ్రీమఠం హుండీ లెక్కింపు పూర్తి

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో చేపట్టిన హుండీ లెక్కింపు పూర్తయినట్లు శ్రీమఠం మేనేజర్లు ఎస్‌కె.శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్ తెలిపారు. మంగళవారం శ్రీమఠం ఆవరణలోని శ్రీగురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ అధికారులు, శ్రీమఠం అధికారుల సమక్షంలో సేవాదారులతో కలిసి లెక్కింపు చేపట్టారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలలో రాఘవేంద్రస్వామి దర్శనార్థమై వచ్చిన భక్తులు కానుకల రూపంలో హుండీలో వేసిన 27 రోజుల ఆదాయాన్ని లెక్కించామని, నగదు రూ.3,50,17,143, బంగారం 138 గ్రాములు, వెండి 950 గ్రాములు వచ్చినట్లు తెలిపారు.

టిడిపి పట్టణ అధ్యక్షులుగా రాజానందు

ప్రజాశక్తి - కౌతాళం

టిడిపి పట్టణ అధ్యక్షులుగా డాక్టర్ రాజానంద్ నియమితులయ్యారు. పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తున్న రాజానందును పట్టణ అధ్యక్షులుగా నియమించినందుకు పార్టీ శ్రేణులు మంగళవారం హర్షం వ్యక్తం చేశాయి. పార్టీ కోసం కష్టపడిన వారికి పదవులు రావడం ఒక్క టిడిపితోనే సాధ్యమన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కౌలు హక్కు పత్రాలివ్వాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - ఆదోని రూరల్

కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలిచ్చి, పంట ఈ-క్రాప్ చేయాలని, బ్యాంకులో పంట రుణాలు ఇప్పించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు కోరారు. మంగళవారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. వెంకటేశులు, రైతు సంఘం మండల నాయకులు బాష, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి దస్తగిరి బాషా, సత్యనారాయణ రెడ్డి మాట్లాడారు. మండలంలో చాలా మంది కౌలు రైతులు బ్యాంకు రుణాలందక అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. కొంతమంది వడ్డీ వ్యాపారుల ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. గుర్తింపు కార్డు లేకపోవడం వల్ల ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందడం లేదని, కౌలు రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిపి కౌలు కార్డులు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హామీ ఇచ్చారు.

ఎస్సీ బాలుర వసతి గృహం పరిశీలన

ప్రజాశక్తి - హొళగుంద

హొళగుందలోని బాలుర ఎస్సీ వసతి గృహాన్ని అధికారులు పరిశీలించారు. వసతి గృహాన్ని పునఃప్రారంభించాలని విద్యార్థి, ప్రజా సంఘాలు సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. స్పందించిన అధికారులు మంగళవారం వసతిగృహాన్ని పరిశీలించడానికి సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారి వెంకట్రాముడు, డిప్యూటీ తహశీల్దార్ ముకుందరావు, విఆర్ఒ మల్లేష్, సంక్షేమ అధికారులు నాగముద్దయ్య, సిద్ధప్ప వచ్చారు. పరిశీలించిన అధికారులు వసతి గృహం అన్ని విధాలుగా అనుకూలంగా ఉందని, చిన్న, చిన్న మరమ్మతులు ఉన్నాయని తెలిపారు. అన్ని విషయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు నాగరాజు మాట్లాడుతూ... ఈ విద్యా సంవత్సరంలోనే ప్రారంభమయ్యేలా చూడాలని కోరారు. వారు స్పందించి అన్ని విషయాలు ఉన్నతాధికారులకు తెలియజేసి త్వరగా ప్రారంభించేలా చేస్తామన్నారు. అధికారులకు ఎస్ఎఫ్ఐ, సిఐటియు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

స్త్రీ నిధి రుణాల రికవరీలో అవకతవకలు

- విచారణలో విఎఒ వలీ అక్రమాలు

- రూ.3 లక్షలకు పైగా స్వాహా - ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - దేవనకొండ

విచారిస్తున్న వెలుగు అధికారులు

మండలంలోని పి.కోటకొండ గ్రామంలో స్త్రీ నిధి రుణాల రికవరీలో విఎఒ వలీ అక్రమాలు అధికారుల విచారణలో వెలుగులోకి వచ్చాయి. 'స్త్రీ నిధి రుణాల రికవరీలో విఎఒ చేతివాటం' అనే శీర్షికన ఈనెల 14న ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా వెలుగు ప్రాజెక్టు అధికారుల ఆదేశాల మేరకు స్త్రీ నిధి మేనేజర్ షఫిక్, లీగల్ కోఆర్డినేటర్ ముర్తుజా, మండల సిసిలు సోమన్న, ముద్దరంగడు, కర్రెన్న మస్తాన్, మల్లేష్‌లు మంగళవారం గ్రామానికి వెళ్లి పొదుపు సంఘాలతో విచారించారు. గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో ఝాన్సీ లక్ష్మి, లలిత, జయంతి, కౌసల్య పొదుపు గ్రూపు లీడర్లు, సభ్యులను విచారించారు. విఎఒ వలీ పొదుపు సంఘాల రికార్డులు, సమావేశాలు, తీర్మానాలు సక్రమంగా రాయడం లేదని సభ్యులు వారి దృష్టికి తెచ్చారు. స్త్రీ నిధి రుణాల రికవరీ డబ్బులు సుమారు రూ.3 లక్షలకు పైగా స్వాహా చేసినట్లు విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. 8 పొదుపు సంఘాల సభ్యులకు గాను 4 పొదుపు సంఘాల లీడర్లు, సభ్యులు మాత్రమే విచారణకు హాజరయ్యాయని, ఇంకా 4 పొదుపు సంఘాల సభ్యులతో విచారణ చేయాల్సి ఉందన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఆస్పరి

గాలిమరల కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూ గుండెపోటుతో మృతి చెందిన శ్రీనివాసులు కుటుంబానికి ఎఐటియుసి నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం ఎఐటియుసి తాలూకా అధ్యక్షులు కృష్ణమూర్తి, సెక్యూరిటీ గార్డ్స్ వర్కర్స్ యూనియన్ సహాయ కార్యదర్శి వీరేష్ యూనియన్ తరఫున శ్రీనివాసులు భార్య నాగేంద్రమ్మకు రూ.30 వేలు అందజేశారు.

మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్మించాలి : వైసిపి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్మించాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వైసిపి యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుట్టా ప్రతుల్ ఆధ్వర్యంలో వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్వీ.మోహన్ రెడ్డి అధ్యక్షతన వైసిపి నాయకులు ఆదోని దగ్గర ఉన్న మెడికల్ కళాశాలను సందర్శించడానికి బయల్దేరి వెళ్లారు. అంతకుముందు వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్వీ.మోహన్ రెడ్డి, ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, కోడుమూరు ఇన్‌ఛార్జీ ఆదిమూలపు సతీష్, వైసిపి పార్లమెంట్ రాష్ట్ర కార్యదర్శి కె.జగన్ మోహన్ రెడ్డి, వైసిపి మహిళా రాష్ట్ర కార్యదర్శి శశికళ, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఎద్దుల శివారెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో ఒకేసారి 17 మెడికల్ కళాశాలలు తెచ్చిన ఘనత వైఎస్.జగన్మోహన్ రెడ్డిదని, ఇప్పటికే ఐదు కళాశాలలు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలినవి దాదాపు పూర్తి కావస్తున్నాయని చెప్పారు. ఆదోని మెడికల్ కళాశాలకు రూ.400 కోట్లు కేటాయించారని, ఇప్పటికే రూ.102 కోట్లు ఖర్చుపెట్టారని తెలిపారు. ఆదోని మెడికల్ కళాశాలను కూటమి ప్రభుత్వం పశువుల దొడ్డిగా మార్చిందని, కళాశాలలను ప్రయివేటీకరణ చేసి పేదలకు వైద్య విద్యను దూరం చేయాలని చూస్తోందని విమర్శించారు. ప్రయివేటీకరణ జిఒను రద్దు చేసి ప్రభుత్వమే పూర్తి చేసి, పేదలకు వైద్య విద్యనందించాలని, లేకపోతే వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రయివేటీకరణను రద్దు చేస్తామని హెచ్చరించారు.

మెడికల్ కళాశాలను పరిశీలిస్తున్న వైసిపి బృందం

మండలంలో వైసిపి డీలా..?

- రెండు గ్రూపులుగా చీలిక
- అయోమయంలో పార్టీ కేడర్
- కూటమి పాలనపై పెదవి విప్పని నాయకులు
- ఎర్రకోట రాక కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - నందవరం

నందవరం మండలంలో వైసిపి డీలాపడిందా... పార్టీ కేడర్ అయోమయంలో ఉందా... పార్టీ నాయకులు రెండు గ్రూపులుగా చీలిపోయారా అన్న చర్చ మండలంలో జోరుగా సాగుతోంది. కూటమి పాలనపై నాయకులు పెదవి విప్పడం లేదని పలు విమర్శలు వస్తున్నాయి. వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట చెన్నకేశవరెడ్డి రాక కోసం చాలా మంది నాయకులు ఎదురుచూస్తున్నట్లు సమాచారం.

మండలంలో వైసిపి డీలా పడిందా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. పంచాయతీల్లో వైసిపి పాలనే ఉన్నా పనులు జరగక నిరాశతో ఉన్నట్లు తెలిసింది. గ్రామాల్లో వైసిపి పాలన ఉన్నా సమస్యలను తీర్చలేని స్థితిలో ఉన్నామని వాపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ కూడా పనులు జరగడం లేదని కేడర్ అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. దీనికి తోడుగా పార్టీలో రెండు గ్రూపులు ఏర్పడినట్లు సమాచారం. పార్టీ కార్యక్రమాలకు కొంతమంది నాయకులు దూరంగా ఉంటున్నారు. కూటమి పాలనపై ఖండించాల్సిన వైసిపి నాయకులు నోరు మెదపడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ ఆదేశాల మేరకు నిర్వహించిన సభలో మాత్రమే ఖండిస్తారు.. తప్ప వ్యక్తిగతంగా ఖండించడానికి నాయకులు ముందుకు రావడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీలో అసంతృప్తి రావడానికి అధిష్టానం నిర్లక్ష్యమే కారణమని పార్టీ నాయకులు కొందరు మాట్లాడుకుంటున్నారు. ఎన్నికల సమయంలో గ్రామాల్లో వైసిపి నాయకులు ప్రచారం కోసం గ్రామాలను సందర్శించారు. ఎన్నికలు ముగిసి 18 నెలలు గడిచినా గ్రామాలను సందర్శించింది కానీ, తమ గురించి అడిగింది కానీ లేదని నాయకులు తమ బాధను వ్యక్తపరుస్తున్నట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా ఉండి ఉంటే తాము ధైర్యంగా ఉండే వారమని కొంతమంది నాయకులు బహిరంగంగానే చెబుతున్నారు. రాబోయే ఎన్నికల్లో ఎర్రకోటకు టికెట్ రావాలని భావిస్తున్నట్లు, ఆయన రాక కోసం ఎదురుచూస్తున్నట్లు ఆయన అభిమాన నాయకులు చెప్పకొచ్చారు. ఎర్రకోట లేని లోటు మండలంలో కనిపిస్తోందని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.


చెన్నకేశవరెడ్డి (ఫైల్)


ఎంపిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాయితీ శనగ విత్తనాలు పంపిణీ చేయాలి

- రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు

ప్రజాశక్తి - ఆస్పరి

పప్పు శనగ విత్తనాలను 50 శాతం రాయితీతో రైతులకు పంపిణీ చేయాలని రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు, మండల కార్యదర్శి రంగస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం రైతుసంఘం ఆధ్వర్యంలో ఎంపిఇఒ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రబీ సీజన్‌లో రైతులకు సరిపడ పప్పు శనగ విత్తనాలను సకాలంలో పంపిణీ చేయాలని కోరారు. వర్షాలు కురవడంతో మండలంలోని ఆస్పరి, చిన్నహోతూరు, జొహరాపురం, శంకరబండ, చిరుమాన్ దొడ్డి, హాలిగేరా, చిగిలి, నగరూరు, తంగరడోన గ్రామాల్లో నల్లరేగడి భూముల్లో సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వ్యవసాయ అధికారులు మండలానికి సరిపడే విత్తనాలను 50 శాతం రాయితీతో సరఫరా చేయాలని కోరారు. రైతు సంఘం నాయకులు వీరన్న, వీరాంజనేయులు, ఈరన్న, రంగప్ప, నాగరాజు, వీరేష్, గోవిందు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఇఒ తిమ్మారెడ్డి

ఉన్నత విలువలతో విద్యనందించండి

- ఎంఇఒ తిమ్మారెడ్డి

ప్రజాశక్తి - దేవనకొండ

మెగా డీఎస్సీ-2025లో ఎంపికైన ఉపాధ్యాయులు ఉన్నత విలువలతో కూడిన విద్యనందించాలని ఎంఇఒలు తిమ్మారెడ్డి, విజయనిర్మల, సర్పంచి అరుణ్ కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని తెర్నేకల్ గ్రామంలో శ్రీలక్ష్మి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో డీఎస్సీలో ఎంపికైన వారికి సన్మానం చేశారు. పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెర్నేకల్ గ్రామంలో 21 మంది ఉపాధ్యాయులు, ఆరుగురు పోలీసు ఉద్యోగాలకు ఎంపికయ్యారని, గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చారని తెలిపారు. దేవనకొండ ఎఫ్ఆర్ స్కూల్ కరస్పాండెంట్ రఘునాథ్ పాల్గొన్నారు.

ఐరన్‌బండలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని ఐరన్‌బండ గ్రామంలో డీఎస్పీ భార్గవి ఆదేశాల మేరకు సిఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ముగ్గురు సిఐలు, ఐదుగురు ఎస్ఐలు, ఒక ఎస్ఐ, 51 మంది పోలీసులతో కలిసి మంగళవారం తెల్లవారుజామునే గ్రామాన్ని దిగ్బంధించారు. అనుమానితులు, నేరచరిత్ర కలిగిన 30 మంది ఇళ్లపై దాడులు నిర్వహించి సోదాలు చేపట్టారు. సరైన పత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని పది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పత్రాలు చూపిన వారి వాహనాలను తిరిగి అప్పగిస్తామని, సరైన పత్రాలు లేనివారి వాహనాలను ఆర్‌టిఒకు రాస్తామని తెలిపారు. సిఐ విజయభాస్కర్ గ్రామస్తులతో మాట్లాడుతూ... గ్రామాల్లో చిన్న విషయాలకే రెచ్చగొట్టి గొడవల జోలికి వెళితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మృతురాలికి టిడిపి నివాళి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త మాధవరం రామిరెడ్డి అభిమాని ఉలువ భీమన్న తల్లి నరసమ్మ మృతదేహానికి టిడిపి నాయకులు, మాజీ సర్పంచి ఎన్.రఘునాథ్ రెడ్డి నివాళులర్పించారు. సోమవారం రాత్రి నరసమ్మ అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న రఘునాథ్ రెడ్డి టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం ఆమె మృతదేహాన్ని సందర్శించి పూల మాల వేసి నివాళులర్పించారు. ఉలువ భీమన్న, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని, పార్టీతో పాటు రామిరెడ్డి కుటుంబం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూస్తామని తెలిపారు. వైన్ షాప్ విజయ్, భీమారెడ్డి, నాగరాజు, రాఘప్ప ఉన్నారు.

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రఘునాథ్‌రెడ్డి

'పత్తి కాయ పగలడానికి పొటాషియం నైట్రేట్ వాడాలి'

ప్రజాశక్తి - మంత్రాలయం

పత్తి పంటలో కాయ పగలడానికి పొటాషియం నైట్రేట్ వాడాలని వ్యవసాయ అధికారి నాగ సరోజమ్మ సూచించారు. మంగళవారం మండలంలోని రచ్చుమర్రి, మాధవరం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' ద్వారా స్థానిక రైతు సేవా కేంద్రాల వద్ద రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పత్తి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వర్షపు నీరు నిల్వ ఉంటే బయటకు పంపించి కాయలు పగలడానికి 5 గ్రాముల పొటాషియం నైట్రేట్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. నానో యూరియా వైపు మొగ్గు చూపాలని ఎడిఎ మహ్మద్ ఖాద్రి కోరారు. ఎఇఒ తిరుమల రెడ్డి, విఎఎలు రాజేష్, విజయ్, సురేంద్ర, రంజాన్ పాల్గొన్నారు.

'సాయి గణేష్'లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని జిఎం పెట్రోల్ బంకు వెనుక భాగాన ఉన్న సాయి గణేష్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కాలనీ వాసులు కోరారు. మంగళవారం కాలనీలో పర్యటించిన మున్సిపల్ కమిషనర్‌కు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... కాలనీలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, రోడ్లన్నీ గుంతలమయమై ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వర్షమొచ్చిన సమయంలో ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయని చెప్పారు. రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉందన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని తెలిపారు. కాలనీలో వీధి దీపాలు కూడా లేవని, రాత్రిపూట విషపురుగులతో భయభ్రాంతులకు గురవుతున్నామని వాపోయారు. తాగునీటి సౌకర్యం కూడా లేదని పేర్కొన్నారు. కాలనీకి రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, కనీస అవసరాలను నెరవేర్చాలని కోరారు. కాలనీవాసుల విన్నపం మేరకు మున్సిపల్ కమిషనర్ కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పశువుల దొంగలు అరెస్టు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో పశువుల దొంగలను అరెస్టు చేసి, రూ.కోటికి పైగా విలువైన పశువులను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ హేమలత తెలిపారు. మంగళవారం రాత్రి రెడ్డి హాస్టల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో కొన్నేళ్లుగా పశువులను దొంగలిస్తూ, అడ్డొచ్చిన వారిపై క్రూరంగా రాళ్లు, సోడా సీసాలతో దాడులు చేసిన ఘటనలు జరిగాయన్నారు. ఫిర్యాదుల మేరకు నిఘా పెంచామని తెలిపారు. ఈ ముఠాపై వివిధ ప్రాంతాల్లో 40 కేసులు ఉన్నట్లు చెప్పారు. ఆదోని సమీపంలోని మాధవరం రోడ్డులో వన్ టౌన్ సిఐ శ్రీరామ్, ఎస్ఐలు షాబీర్ బాష, గోపాలరాజు, పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అరెస్టు చేశారని తెలిపారు. 2 బొలెరో వాహనాలు, కారును స్వాధీనం చేసుకొని, 16 మందిని అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. రూ.1.49 కోట్ల విలువ గల 542 పశువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 25 మంది ముఠాలో సభ్యులున్నారని, మిగతా వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు. ఈ ముఠాలోని కొందరిపై హత్య కేసు, దొమ్మి కేసులు ఉన్నాయన్నారు.

నిందితులను చూపుతున్న డీఎస్పీ హేమలత

పుట్టిన తేదీ సవరణ

మొహమ్మద్ ఫయాజుల్లా వయస్సు సుమారు 41 సంవత్సరాలు తండ్రి మొహమ్మద్ ఇనాయతుల్లా, మొహమ్మద్ నగర్, జోహరపురం, కర్నూలు, కర్నూలు జిల్లా ఆంధ్రప్రదేశ్ నివాసిని. అధికారులు జారీ చేసిన నా ఇండియన్ పాస్‌పోర్ట్‌లో నా పుట్టిన తేదీని 05-05-1980 అని నమోదు చేశారు. నా అసలు పుట్టిన తేదీ 05-05-1984 అని నేను ఇందుమూలంగా ప్రకటిస్తున్నాను. పొరపాటున సంబంధిత అధికారులు జారీ చేసిన నా ఇండియన్ పాస్‌పోర్ట్‌లో నా పుట్టిన తేదీని 05-05-1980 అని తప్పుగా పేర్కొన్నారు. కాబట్టి దయచేసి నా ఆధార్ కార్డ్ & పాన్ కార్డ్ ప్రకారం నా అసలు పుట్టిన తేదీని 05-05-1984 అని పరిగణించమని సంబంధిత అధికారులను అభ్యర్థిస్తున్నాను.

IN THE COURT OF THE II ADDL. DISTRICT JUDGE, KURNOOL AT ADONI.
IA.52/2022 in AS. 2018

Between:
1. N. Vijayalakshmi @ Anantha Lakshmi
2. M.S. Fayaz. ... Appellants

.VS.

N.Savithramma & others. ...Respondents

NOTICE

R8-
Priyanka Gandhi,
D/o late A.C. Mahendra Reddy,
senicure, 104 Basapuram village,
Adoni mandalam.
Sirs/Madam,

Please take notice that the above named appellants have preferred the above appeal against the decree and judgement passed in O.S.238/2006 on the file of Prl. Junior Civil Judge, Adoni. As there is delay in filing the appeal, the above petition is filed under sec.5 of the Limitation Act. The above said matter is posted for your notice and appearance on 18-09-2025. You are hereby directed to appear before the above said court on the above said date at 10.30 a.m. either in person or through your counsel, else the matter will be decided by setting you ex-parte.

K. Abdul Rasheed,
D. Savitha Rani,
Advocates, Adoni.

IN THE COURT OF THE II ADDL. DISTRICT JUDGE, KURNOOL AT ADONI.
IA. 51/2022 in AS /2018

Between:
1. N. Vijayalakshmi @ Anantha Lakshmi
2. M.S. Fayaz. ...Appellants

.VS.

N. Savithramma & others. ...Respondents

NOTICE

R8-
Priyanka Gandhi,
D/o late A.C. Mahendra Reddy,
senicure, 104 Basapuram village,
Adoni mandalam.

Sirs/Madam,

Please take notice that the above named appellants have preferred the above appeal against the decree and judgement passed in O.S.238/2006 on the file of Prl. Junior Civil Judge, Adoni. As there is delay in representing the appeal, the above petition is filed to condone the delay in representing the appeal. The above said matter is posted for your notice and appearance on 18-09-2025 You are hereby directed to appear before the above said court on the above said date at 10.30 a.m. either in person or through your counsel, else the matter will be decided by setting you ex-parte.

K. Abdul Rasheed,
D. Savitha Rani,
Advocates, Adoni.

IN THE COURT OF THE HON'BLE VIIth ADDL DISTRICT COURT JUDGE: KURNOOL
E P NO:- 709/2023 in A A NO:-478/2016

Between:
M/s Shriram Finance Ltd,. Represented by tis GPA Holder G.Mralli
...Claimant/Decree Holder
V/s
Mr. 1. S.Subhan Basha, S/o.S. Yousuf Main H.No. 41/426, Kotha Peta, Kurnool Disttict
2.Sarshar Basha, S/O: Modheen Miah H no: 39/7D-C2, K.V.R.Garden Vaddegeri Suktan Miah Complex Kurnool Disttict ...JDR'S

1,2 వ ప్రతివాదులు

ORDER 21 RU 37.C.P.C NOTICE

పైన నెంబర్ అమలు అర్జీ (E.P.) లో వాది DHr. అయిన శ్రీరాం ట్రాన్స్ పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ వారు 1వ 2వ ప్రతివాదులైన (JDr1&2) మీ పైన అర్బిట్రేషన్ అవార్డును పొంది అవార్డు అమలు చేయమని కోరుతూ అమలు అర్జీ (E.P) దాఖలు చేసి ఉన్నారు. పై అమలు అర్జీ నందు కోర్టువారు మీకు మీరున్న అడ్రసుకు Order21, Rule37, C.P.C. నోటీసులు ఎన్నిసార్లు పంపించిన ఉద్దేశ పూర్వకంగా తీసుకొనకుండా త్రిప్పి వెనుకకు పంపుతూ ఉన్నారు. కావునా పై అమలు అర్జీ నందు మీకు ఏమైనా అక్షేపనలు వున్న ఎడల పై కోర్టు వారి యెదుట 18.09.2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు హజరై మీ అక్షేపణలు తెలుపు కోవలెను. లేని యెడల పై అమలు అర్జీ మీ తెలియజేయడమైనది పరోక్షమందు తీర్మానించబడునని

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

తేది : 18.09.2025

P. CHANDRA SEKHAR
DHR SAID ADVOCATE
KURNOOL

విద్యుత్ సంస్థలో పోస్టులు భర్తీ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - పాములపాడు

జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కో సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులతో భర్తీ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి. యేసురత్నం ప్రభుత్వాన్ని కోరారు. మండంలోని పార్టీ కార్యాలయంలో వారు మంగళవారం మాట్లాడారు. 30ఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు పోరాట ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థల్లో 30 ఏళ్లకుపైగా తక్కువ వేతనాలతో ఎక్కువ గంటలు పని చేస్తూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు సంస్థకు వెన్నెముకగా నిలిచారన్నారు. వారి శ్రమ వల్లనే జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కం సంస్థలు నష్టాలను అధిగమించి లాభాలతో నడుస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విస్మరించి బయటి అభ్యర్థులతో పోస్టులను భర్తీ చేయాలని చెప్పడం అన్యాయమన్నారు. ట్రాన్స్‌కోలో డిప్లమా పూర్తి చేసిన కాంట్రాక్టు కార్మికులకు జూనియర్ ఇంజనీర్ల పోస్టులు కేటాయించాలని కోరారు. పోస్టుల భర్తీ ప్రక్రియలో వయసు పరిమితిని 50 ఏళ్లకు పెంచాలని, ఇప్పటికే వారు 30ఏళ్లుగా పని చేస్తున్నారని తెలిపారు. ఎస్సీలకు ఐదేళ్ళ, బిసిలకు మూడేళ్ల మినహాయింపు ఇవ్వాలని కోరారు. నాన్ టెక్నికల్ పోస్టుల భర్తీలో అర్హత ఉన్న డిగ్రీ, పీజీ పూర్తి చేసిన, ప్రస్తుతం పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మూగ దివ్యాంగ అభ్యర్థులను రేషియో ప్రకారం ప్రత్యేకంగా పోస్టులు కేటాయించి భర్తీ చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులు తమ హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు పాములపాడు మండల కార్యదర్శి ఎం. రాజు, కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి. స్వామన్న ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు యేసురత్నం

ఉల్లి రైతులను ఆదుకోవడమే ధ్యేయం

ప్రజాశక్తి - సిబెళగల్ : ఉల్లి రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని తహాశీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. మంగళవారం కంబధహల్‌లో ఉల్లి నిల్వలను ఎఒ మల్లేష్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ... ఉల్లి పంటను 100-120 రోజుల్లో మాత్రమే కోత కోయాలని, 10 నుంచి 15 రోజుల్లో గ్రేడింగ్ నాణ్యతను బట్టి మార్కెట్‌లో మంచి ధరలు లభిస్తుందని తెలిపారు. గ్రేడింగ్ పద్ధతులపై అవగాహన లేకపోవడంతో రైతులు మంచి ధరలు అందుకోలేక పోతున్నారని చెప్పారు. వ్యవసాయ సిబ్బంది ఆసిఫ్, సునంద, వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

- కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్ : స్టేట్ అల్లైడ్ అండ్ హెల్త్ కేర్ సర్వీసెస్ డిప్లొమా కోర్సులు డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, కార్డియాలజీ, ఇసిజి, ఖ్యాత్ ల్యాబ్, డయాలసిస్, మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్, రేడియో గ్రాఫిక్, ఆఫ్తాల్మిక్, డార్క్ రూం అసిస్టెంట్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 27 వరకు గడువు ఉందని, పూర్తి చేసిన దరఖాస్తులను కర్నూలు మెడికల్ కళాశాలలో రూ..100 చెల్లించి అందజేయాలని తెలిపారు. అక్టోబర్ 10న కౌన్సెలింగ్ ఉంటుందని అన్నారు.

నేషనల్ కాన్ఫరెన్స్‌లో 'కెఎంసి'కి మొదటి బహుమతి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్ : ఇటీవల జాతీయస్థాయిలో కోయంబత్తూరులో నిర్వహించిన పీడియాట్రిక్ సర్జరీ విభాగపు నేషనల్ కాన్ఫరెన్స్, స్వాకాన్‌లో కర్నూలు మెడికల్ కళాశాల పీడియాట్రిక్ సర్జరీ విభాగపు పీజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని డాక్టర్ ప్రియాంక ఇ-పోస్టర్ విభాగంలో మొదటి బహుమతి సాధించినట్లు కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ తెలిపారు. మంగళవారం విద్యార్థిని, పీడియాట్రిక్ సర్జరీ విభాగపు అధిపతి డాక్టర్ శివకుమార్‌ను, వారి విభాగపు వైద్యులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ... డాక్టర్ ప్రియాంకను ఆదర్శంగా తీసుకోవాలని, జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు.

28న జాతీయ కవయిత్రుల సమ్మేళనం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్ : ఈనెల 28న కర్నూలులో 8వ జాతీయ కవయిత్రుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు గణేష్ సాహితీ సంస్థ, జనతా ఫౌండేషన్ అధినేత కొత్తూరు సత్యనారాయణ గుప్తా తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. గణేష్ సాహితీ సదన్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, ఉత్సాహం ఉన్న కవయిత్రులు పాల్గొనాలని కోరారు. ఈనెల 22లోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వాట్సాప్ నెంబర్ 94402 28999కు పేరు, ఊరు పంపించాలని అన్నారు.

స్మార్ట్ సిటీకి ప్రతిపాదనలు సిద్ధం : కమిషనర్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరాన్ని ఆధునిక సౌకర్యాలతో కూడిన స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేసేందుకు కీలకమైన ప్రతిపాదనను రూపొందిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం ఆయన సీతారాం నగర్, కొత్తపేట, అశోక్ నగర్, పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఏడు అంశాలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనలు అమలులోకి వస్తే కర్నూలు నగరం కొత్త రూపురేఖలు సంతరించుకొని స్మార్ట్ సిటీ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఇన్‌ఛార్జీ ఎస్ఇ శేషసాయి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఎంఇ మనోహర్ రెడ్డి, డిసిపి వెంకటరమణ, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్ బాష, డిఇఇ గిరిరాజ్, ఎఇ జనార్ధన్ పాల్గొన్నారు.

శిథిలమైన గదుల పరిశీలన

ప్రజాశక్తి - సి బెళగల్ : సిబెళగల్ గురుకుల పాఠశాలలో శిథిలమైన తరగతి గదులను ఉన్నతాధికారులు ఎపిఇడబ్ల్యు ఐడిసి ఇఇ కె.నాగిరెడ్డి, డిఇ పూర్ణ చంద్ర రావు, ఎఇ రఘుబాబులు ప్రిన్సిపల్ చింతలయ్య సమక్షంలో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 30 ఏళ్లకు పైగా ఈ తరగతి గదులున్నాయని, ఇటీవల కాలపరిమితి పూర్తయిన సందర్భంగా పడి పోయి ప్రమాదకరంగా ఉండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వైపు విద్యార్థులు సంచరించకుండా చూడాలని ప్రిన్సిపల్‌కు సూచించారు. నూతన గదుల నిర్మాణం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామన్నారు.

నానో యూరియాతో అధిక దిగుబడి

ప్రజాశక్తి -కోడుమూరు : నానో యూరియా వాడకంతో దిగుబడి పెరుగుతుందని కర్నూలు ఇన్‌ఛార్జీ ఎడిఎ ఎల్.శ్రీవర్ధన్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి మదన్మోహన్ గౌడ్ తెలిపారు. మంగళవారం మండలంలోని వెంకటగిరి గ్రామంలో 'పొలం పిలుస్తుంది' నిర్వహించారు. ఉల్లి పంటలో సాగు గురించి శ్రీవర్ధన్ రెడ్డి, మదన్మోహన్ గౌడ్, హిందూ, ప్రియాంక వివరించారు. ఉల్లి పంటలో పై పాటుగా వేసే రసాయనిక ఎరువులకు బదులుగా నానో యూరియాను ఎకరాకు 500 మిల్లీలీటర్లు స్ప్రే చేయడం వల్ల దిగుబడి పెరుగుతుందని తెలిపారు.

అనధికార లే ఔట్లను క్రమబద్ధీకరించుకోండి

- నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్

ప్రజాశక్తి - బేతంచెర్ల : బేతంచర్ల నగర పంచాయతీ పరిధిలోని అనధికార ప్లాట్ల యజమానులు తమ లే ఔట్లను క్రమబద్ధీకరించుకోవాలని కమిషనర్ డి. హరి ప్రసాద్ సూచించారు. బేతంచర్ల నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్లాట్ల, రియల్ ఎస్టేట్ డెవలపర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. యజమానులు ప్రభుత్వం అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణ పథకం 2020ని కొన్ని మార్పులతో కొనసాగింపుగా 2025ను తీసుకువచ్చిందని తెలిపారు. అనధికార ప్లాట్ల యజమానులు లేఔట్ రెగ్యులేషన్ కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎల్ఆర్ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎల్.టి.పిలకు/రియల్ ఎస్టేట్ డెవెలపవర్స్, అనధికార ప్లాట్ల యజమానులకు సూచించారు. భవిష్యత్తులో ఇల్లు కట్టుకోవాలంటే కచ్చితంగా ఎల్ఆర్ఎస్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. క్రమబద్ధీకరణకు ఈ పథకం లకింద దరఖాస్తు చేసుకునే వారికి ప్రోత్సాహకాలు, రాయితీలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

నానో యూరియాతో అధిక లాభం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ఒక బాటిల్ నానో యూరియా ఒక సంచి యూరియాకు సమానమని, నానో యూరియాతో రైతులకు అధిక లాభం చేకూరుతుందని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. మండలంలోని నాగటూరు, కొణిదెల గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తుందిలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం. గిరి, టెక్నికల్ అగ్రికల్చర్ ఆఫీసర్ పనేశ్వర్ రెడ్డి, ఎఒ పి. షేక్షావలి హాజరై మాట్లాడారు. మొక్క ఎదుగుదల, అభివృద్ధికి నానో యూరియా కీలకంగా పని చేస్తుందన్నారు. భారత ప్రభుత్వం ఆమోదించిన ఏకైక నానో ఎరువు ఇఫ్కో నానో యూరియా అని తెలిపారు. దీనిని ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ (ఎఫ్‌సిఒ)లో చేర్చారని తెలిపారు. ఇఫ్కో దీనిని అభివృద్ధి చేసి పెటెంట్ హక్కులు పొందిందన్నారు. నానో యూరియా పంటల ఆరోగ్యాన్ని మెరుగురుస్తూ రైతులకు లాభదాయకతను పెంచుతుందన్నారు.

కోవెలకుంట్ల : కోవెలకుంట్ల మండలంలోని రైతులు పంట నమోదు చేయించుకోవాలని ఎఒ సుధాకర్ రెడ్డి తెలిపారు. దేవనూరు, లింగాల గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోందిలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంట నమోదు చేయించుకోవడంతో పంట నష్ట పరిహారం, పంట ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. రైతులు రసాయన ఎరువులని అధికంగా వాడడంతో వాటి వలన కలుగు దుష్ఫలితాలను వివరించారు. నానో యూరియా, నానో డిఎపి ఆవశ్యకత, వాటిని ఎలా ఉపయోగించుకోవాలో రైతులకు వివరించారు.

గాలికుంటు టీకాలు వేయించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్యాపిలి : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు విధిగా వేయించాలని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. తహాశీల్దార్ భారతి, సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ మధుసూదన్, వెటర్నరీ ఏడి విక్టర్‌తో కలిసి గాలికుంటు నిరోధక టీకాల పోస్టర్‌ను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. పశువుల ఆరోగ్యం కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రతి రైతు తన పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. టీకాలను అక్టోబర్ 15 వరకు వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ యాదవ్, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, ప్రసాద్ రెడ్డి, కాజాపీర్, వీరాంజనేయులు, రామ్మోహన్ యాదవ్, కొంగనపల్లె మధు, రమేష్ గౌడ్, ఎస్.కె వలి, వెంకట్ రెడ్డి, ప్రిన్సిపల్ మధు, శివ, దస్తగిరి, వెంకటేష్, ప్రతాప్, రంగన్న, దాస్ పాల్గొన్నారు.

బండి ఆత్మకూర్ : గ్రామాల్లోని రైతు సోదరులు తమ పశువులకు గాలికుంటు వ్యాక్సిన్ వేయించడంతో పశువులు సురక్షితంగా ఉంటాయని, పాడిపశువులు అధిక పాల దిగుబడిని ఇస్తాయని డాక్టర్ అనూష తెలిపారు. మండలంలోని ఎర్రగుంట్ల గ్రామంలో గాలికుంటు వ్యాక్సిన్ ప్రక్రియను ఏడి వెంకటేశ్వర్లు పరిశీలించారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు డి. సిద్దయ్య, టిడిపి నాయకులు జగన్మోహన్ రెడ్డి, రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓజోన్ పొరను రక్షించుకోవాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : అధిక కాలుష్యాన్ని నిర్మూలించి ఓజోన్ పొరను రక్షించుకోవాలని కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్ శెట్టి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యావరణ సమతుల్యానికి ఓజోన్ పొర ఎంతగానో దోహదం చేస్తుందని, దానిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. కెమిస్ట్రీ అధ్యాపకులు డాక్టర్ ఎం.బాలరాజు, డాక్టర్ బి.వెంకన్న, డాక్టర్ బి.అనూష, డాక్టర్ బంగారు బాబు, డాక్టర్ మీర్ అల్తాఫ్ అహ్మద్ పాల్గొన్నారు.

హెల్త్ కార్డు ద్వారా వైద్య సేవలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : జర్నలిస్టుల హెల్త్ కార్డుల ద్వారా వైద్య సేవలు అందించాలని ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీడియా సెంటర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని ప్రయివేట్ ఆస్పత్రుల్లో తప్పనిసరిగా జర్నలిస్టుల హెల్త్ కార్డు సూచిక బోర్డులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీనియర్ జర్నలిస్టు మీసాల రామస్వామి, వారణాసి ప్రసాద్, రవి, శ్రీను పాల్గొన్నారు

ఎంపిడిఒకు ఘన సన్మానం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : ఎంపిడిఒ శ్రీనివాసులు ప్రమోషన్ పొంది నంద్యాల డ్వామా ఏపీడీగా బదిలీ కావడంతో మంగళవారం ఓర్వకల్లు ఎంపిడిఒ సమావేశ భవనంలో ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా మండల ప్రత్యేకాధికారి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య హాజరయ్యారు. మండలంలో అభివృద్ధి పనులు వేగంగా అమలు చేసేందుకు కృషి చేశారని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శ్రీనివాసులును కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, టిడిపి నాయకులు ఘనంగా సన్మానించారు. మండల అధ్యక్షులు కె.తిప్పన్న, జడ్‌పిటిసి రంగనాథ్ గౌడ్, వైస్ ఎంపిపి, టిడిపి మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి, టిడిపి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి గుట్టపాడు మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి : ఎఒ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు : ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతూ పంట నమోదు చేసుకోవాలని ఎఒ ఎం.శివ శంకర్ తెలిపారు. మంగళవారం మండలంలోని కడివెళ్ల గ్రామంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. పత్తి, వరి, వేరుశనగ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పత్తి పంట ముంపునకు గురైనప్పుడు పిందెలు, కాయలు రాలిపోవడం, ఆకులు ఎర్రబారతాయని తెలిపారు. పంట చేలల్లో ఉన్న నీటిని తీసేయడంతో పాటు ఎండగా ఉన్న సమయంలో పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు ఒక లీటరు నీటికి లేదా 19 గ్రాములు యూరియా లీటర్ నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో మార్చి మార్చి పిచికారి చేసుకోవాలని తెలిపారు.

ఓజోన్ పొరను కాపాడుకుందాం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ఓజోన్ పొరను కాపాడుకునేందుకు దాని పరిరక్షణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు పేర్కొన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం వ్యాసరచన పోటీలు, ఓజోన్ పొర ప్రాముఖ్యతను వివరించారు. సందర్భంగా వ్యాసరచన పోస్టల్ ప్రజెంటేషన్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ రంగముని మాట్లాడుతూ... ఓజోన్ పొర ప్రాముఖ్యత, కాపాడుకోవాల్సిన బాధ్యత గురించి విద్యార్థులకు వివరించారు. కన్వీనర్ డాక్టర్ తలాత్ పర్వీన్ పిపిటి ప్రజెంటేషన్ ద్వారా ఓజోన్ పొర పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర అధ్యాపకుడు శశీధరయ్య ప్రసంగిస్తూ ఓజోన్ పొరను కాపాడకపోతే పలు రకాలైన ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి. పరిమళాదేవి, కో-కన్వీనర్ సుమలత, అధ్యాపక బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.